ఆర్‌జియుకెటి ప్రవేశాల ఎంపిక జాబితా, కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి పరిధిలోని నాలుగు క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ బీ టెక్ కోర్సుకుఎంపికైన విద్యార్థుల జాబితా ఈ నెల 23వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు విడుదల చేయనున్నట్లు ఆర్‌జియుకెటి ప్రవేశాల కన్వీనర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. నూజివీడు క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 30న, జులై ఒకటో తేదీన నూజివీడు క్యాంపస్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 30న, జులై ఒకటో తేదీన కడప జిల్లాలోని ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. అలాగే శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులకు జులై 2, 3 తేదీల్లో, ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులకు జులై 4, 5 తేదీల్లో నూజివీడు క్యాంపస్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపరు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు జులై 14వ తేదీన వారికి కేటాయించిన క్యాంపస్‌లలో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

విద్యాశాఖ మొద్దు నిద్ర..!

ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్ల దోపిడీకి అధికారుల వత్తాసు

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫారం వంటివి విక్రయిస్తున్నా మౌనం

కనీస తనిఖీలు చేపట్టని విద్యాశాఖ అధికారులు

మామూళ్ల మత్తే కారణమని ఆరోపణలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వెయ్యికిపైగా ప్రయివేటు విద్యాసంస్థలు

ఏలూరు జిల్లాలో 345 ప్రయివేటు స్కూళ్లు, 92 వేల మంది విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారు. కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాల దోపిడీకి వత్తాసు పలుకుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్లలో పుస్తకాలు, బ్యాగులు, షూస్ వంటి వస్తువులు విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఫీజుల నుంచి పుస్తకాల కొనుగోలు వరకూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నా విద్యాశాఖ అధికారులు కనీస తనిఖీలు సైతం చేయకపోవడం గమనార్హం. దీంతో ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీ ఏయేటికాయేడు వటవృక్షంలా పెరిగిపోతున్న పరిస్థితి ఉంది. జిల్లా ఉన్నతాధికారులు సైతం విద్యాశాఖ తీరుపై సమీక్షా సమావేశాలు నిర్వహించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1,064 ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 202 వరకూ ఉండగా, యుపి స్కూళ్లు 422, హైస్కూళ్లు 440 వరకూ ఉన్నాయి. ఈ ప్రయివేటు విద్యాసంస్థల్లో రెండు లక్షల మంది విద్యార్థులు విద్య అభ్యశిస్తున్నారు. విభజిత ఏలూరు జిల్లాలో 345 ప్రయివేటు విద్యాసంస్థలు ఉండగా 92 వేల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్న ప్రయివేటు స్కూళ్లపై కనీస పర్యవేక్షణ లేకుండాపోయింది. విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్‌కెజికి సైతం రూ.పది వేలకుపైగా వసూలు చేస్తున్నా.. అక్కడ ఉన్న కనీస ప్రమాణాలు ఏమిటో కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫీజులకు సంబంధించిన వివరాలు స్కూళ్ల బయట డిస్‌ప్లే చేయాలనే నిబంధనను ఏఒక్క స్కూల్ పాటించకపోయినా అడిగే నాథుడే లేకుండాపోయాడు. పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్, బెల్ట్ వంటి వస్తువులన్నీ స్కూల్‌లోనే తీసుకోవాలంటూ ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నా అధికారులకు పట్టడం లేదు. పుస్తకాలు, ఇతర వస్తువుల పేరుతో ప్రతి విద్యార్థి నుంచి దాదాపు రూ.పది వేలకుపైగా గుంజుతున్న పరిస్థితి ఉంది. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే తమ పిల్లలను ఇబ్బంది పెడతారనే భయం వెంటాడుతోంది. ఫిర్యాదు చేసినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోరనే అభిప్రాయం తల్లిదండ్రుల్లో నెలకొంది. విద్యాశాఖ అధికారులకు ఇదంతా తెలిసే సాగుతుందనే అభిప్రాయమూ జనాల్లో ఉంది. విద్యాశాఖ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. సామాన్యులను పీల్చిపిప్పి చేస్తున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో కనీస సౌకర్యాలు ఉండకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు విద్యాసంస్థల్లో చేరుస్తున్నారు. ఇదే అదునుగా ప్రయివేటు యాజమాన్యాల దోపిడీకి అంతేలేకుండాపోయింది.

కనీస వసతులు లేకపోయినా భారీగా ఫీజులు

శ్రీ చైతన్య, నారాయణ, శశి వంటి కార్పొరేట్ విద్యాసంస్థలతోపాటు ఇతర ప్రయివేటు విద్యాసంస్థలు తాము చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. విద్యాశాఖ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని ప్రయివేటు విద్యాసంస్థలు తమ దోపిడీని యథేచ్ఛగా సాగిస్తున్నాయి. స్కూళ్లలో కనీసం తాగునీటి సదుపాయంగాని, ఆటస్థలంగాని, చాలా స్కూళ్లు ఫైర్‌సేఫ్టీ నిబంధనలుగాని అమలు చేయడం లేదు. పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు కనీస విద్యార్హతలు ఉండటం లేదు. అయినప్పటికీ ఫీజుల దోపిడీ మాత్రం సాగుతోంది. స్కూళ్ల అనుమతులు రెన్యువల్ చేసేటప్పుడు విద్యాశాఖ అధికారులు అన్ని నిబంధనలూ అమలవుతున్నాయో, లేదో పరిశీలించాల్సి ఉన్నా సక్రమంగా జరగడం లేదు. జిల్లాలో చాలా స్కూళ్లకు ఆటస్థలం కూడా లేదు. అత్యధిక స్కూళ్లలో డ్రిల్ పీరియడ్ సైతం తొలగించారు. ఫీజు చెల్లించడం ఆలస్యమైతే నేరస్తుల మాదిరిగా బయట నిలబెట్టి విద్యార్థులను హింసిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అయినప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాలు ప్రయివేటు విద్యాసంస్థల్లో పుస్తకాలు, బ్యాగుల పేరుతో ఏవిధంగా దోపిడీ చేస్తున్నారో స్కూల్స్‌కు వెళ్లి కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారుల్లో పెద్దగా చలనం కనిపించడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా ప్రయివేటు స్కూళ్లలో జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్‌గా ఉండాలి

నాటుసారా అమ్మకాలను వదిలి బయటకు వచ్చినవారికి కలెక్టర్ సూచన

40 మందికి డిఆర్‌డిఎ సమన్వయంతో రుణాలు పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రుణ పత్రాలు అందిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ కలెక్టర్

మహిళలు తలుచుకుంటే ఏమైనా సాధించగలరని, నవోదయం కార్యక్రమంలో రుణాలు తీసుకుంటున్న వారంతా మళ్లీ నాటుసారా జోలికి వెళ్లకుండా భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్‌గా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. గురువారం కలెక్టరేట్లోని గౌతమి సమావేశ మందిరంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా అమ్మకాలను వదిలి బయటకు వచ్చిన 40 మందికి డిఆర్‌డిఎ సమన్వయంతో రుణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత మాట్లాడుతూ జిల్లాలో సారా తయారీ, రవాణా, అమ్మకం కలిగి ఉన్న 140 గ్రామాలను గుర్తించి అనేక చర్యల అనంతరం 135 గ్రామాలను సారారహిత గ్రామాలుగా ప్రకటించామని తెలిపారు. నాటుసారా అమ్మకాల నుంచి బయటకు వచ్చిన వారికి ఆర్థిక స్వావలంబన కోసం డిఆర్‌డిఎ సమన్వయంతో రుణాలిస్తామని చెప్పారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నాటుసారా అమ్మకం, తయారీ, రవాణా చేస్తున్న వారిపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయటం, శిక్షలు వేయడం మాత్రమే జరుగుతున్న నేపథ్యంలో వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపించడం ద్వారా వారిలో మార్పు తీసుకురావొచ్చన్నారు. దీనికి ఒక కమిటీని ఏర్పాటు చేసి, సారా తయారీదారులతో మాట్లాడి వారికి ఏం కావాలో తెలుసుకుని లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ రుణాలు తీసుకున్న వారిని ఎప్పుడూ గమనించటం జరుగుతుందని, ఎవరైనా మళ్లీ సారా జోలికి వెళితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలని, భవిష్యత్తులో మరింత సహాయం ప్రభుత్వం నుంచి అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తీసుకున్న సొమ్మును సొంత అవసరాలకు వాడకుండా వ్యాపారాలు చేసి, ఆ గ్రామాల్లో మిగిలిన వారికి ఆదర్శంగా నిలవాలని కోరారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలను ఉన్నత స్థానంలో ఉంచడానికి అనేక అవకాశాలు కల్పిస్తున్నారని, ఆ అవకాశాలను వినియోగించుకుని నాటుసారాకు దూరంగా ఉండి సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఎ.ఆవులయ్య, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, పలువురు ఎక్సైజ్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా పోలవరం, చింతలపూడి, భీమడోలు తదితర ప్రాంతాలకు చెందిన 40 మందికి రూ.31.40 లక్షల విలువైన రుణాలను అందించారు.

భూముల విభజన రుసుం పూర్తిగా మినహాయింపు

జెసి ధాత్రిరెడ్డి

ఏలూరు : సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు తమ భూములను విభజన చేయడానికి ప్రభుత్వం నిర్దేశించిన రూ.500 రుసుమును పూర్తిగా మినహాయించి ఉచితంగా ఈ సేవను పొందే అవకాశం కల్పించిందని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. దీనికి గాను కేవలం దరఖాస్తు రుసుం రూ.50 గ్రామ సచివాలయంలో చెల్లించి జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జెసి విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశాన్ని జాయింట్ పట్టాదారులు అంతా ఉపయోగించుకుని జాయింట్ పట్టాలను విడివిడిగా విభజన చేయించుకోవాలని కోరారు. దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతాయని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయాలు

ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : డిఇఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఏలూరు

ఫీజులు, పుస్తకాలు, యూనిఫారం తదితరాల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీల్చుకుంటున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్న శశి, కెకెఆర్ గౌతమ్, చైతన్య, నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం డిఇఒకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో శశి, కెకెఆర్ స్కూళ్లలో ఫీజులు అధికంగా ఉండటమే కాకుండా పుస్తకాల పేరుతో దోపిడీ పెద్దఎత్తున సాగుతోందని ఆరోపించారు. రూ.మూడు వేల విలువైన పుస్తకాలను రూ.ఎనిమిది వేలు, రూ.పది వేలు చొప్పున విక్రయిస్తున్నారని తెలిపారు. పుస్తకాలు కచ్చితంగా పాఠశాలలోనే కొనాలని ఒత్తిడి చేస్తున్నారని, తక్షణం ఆయా స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.మనోజ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నేత లెనిన్

ఏజెన్సీ గ్రామాల గుండా ప్లాస్టిక్ రహదారి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో రహదారులపై గోతుల బాధ నుంచి విముక్తి కలిగించేందుకు ఆర్అండ్‌బి సరికొత్త ప్రయోగం చేపట్టింది. ఏజెన్సీ గ్రామాల గుండా కొత్తగా ప్లాస్టిక్ రహదారి నిర్మాణాన్ని చేపడుతోంది. మండలంలోని అంకన్నగూడెం పంచాయతీ దిబ్బగూడెం గ్రామం నుంచి వేపులపాడు వరకు మూడు కిలోమీటర్ల మేర ప్లాస్టిక్ రహదారి నిర్మిస్తున్నట్లు ఆర్అండ్‌బి డిఇ హరికృష్ణ తెలిపారు. మొత్తం మూడు కిలోమీటర్లకుగాను రూ.కోటీ 16 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ రహదారి జీలుగుమిల్లి-బుట్టాయగూడెం మండలాల సరిహద్దుగుండా నిర్మాణం కానుంది. ఈ రహదారిని 85 శాతం వరకు తారు కలిపి, చివర్లో పైన 15 శాతం ప్లాస్టిక్ ఉపయోగించి నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. తారు రోడ్డు నిర్మాణం మాదిరిగానే రెండు లేయర్లు వేసి, అనంతరం వెట్ మిక్స్ వేసి, ఆపైన ప్లాస్టిక్ కలిపిన తారు వేస్తారన్నారు. ఇప్పటికే రెండు లేయర్ల పని పూర్తి చేసినట్లు చెబుతున్నారు. త్వరలోనే ప్లాస్టిక్ కలిపిన మెటీరియల్ వేసి రహదారి నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే గోతులు పడే అవకాశం ఉండదని, ప్రయాణం కూడ సులువుగా ఉంటుందని తెలిపారు. త్వరలో ఏజెన్సీలోని మరికొన్ని ప్రాంతాల్లో ఈ తరహా రహదారుల నిర్మాణానికి కృషి చేస్తామని డిఇ తెలిపారు.

నిర్మిస్తున్న ప్లాస్టిక్ రహదారి

ఎంఆర్‌పికే విత్తనాలు అమ్మాలి

జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా

ప్రజాశక్తి - చింతలపూడి

ఎంఆర్‌పికే విత్తనాలు అమ్మాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా అన్నారు. మండలంలోని విత్తనాల దుకాణాల్లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా మాట్లాడుతూ ప్రతి రైతు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు వారికి బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నాణ్యమైన విత్తనాలు అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.నాగకుమార్, వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ ఉన్నారు.



చింతలపూడి : విత్తనాల దుకాణాల్లో తనిఖీలు

చాట్రాయి : మండలంలోని విత్తనాలు సరఫరా చేసే షాపులను జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాషా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలవరంలోని శివ శంకర ఫెస్టిసైడ్ సీడ్స్ షాపును, చనుబండ గ్రామంలోని వెంకట సత్యనారాయణ షాపులను పరిశీలించారు. అనంతరం డీలర్‌తో మాట్లాడుతూ విత్తన శుద్ధి కలిగిన మొలక శాతం ఉన్న విత్తనాలను విక్రయించాలని సూచించారు. కొనుగోలు రశీదు ఇవ్వాలని, ధరల పట్టికను ఎప్పటికప్పుడు బోర్డు మీద రాయించాలని సూచించారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి బి.శివశంకర్ ఉన్నారు.

కొనసాగిన డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ నియామక పరీక్షలు (మెగా డిఎస్‌సి) 2025 గురువారం ఏలూరులో ప్రశాంతంగా సాగాయి. ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 174 మందికి 171 మంది హాజరవ్వగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 141 మంది హాజరవ్వగా తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 197 మందికి 193 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. మొత్తం మూడు కేంద్రాల్లో 521 మందికి 505 మంది హాజరవ్వగా, 16 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకు సిద్ధార్థ క్వెస్ట్‌లో 189 మందికి 180 మంది హాజరవ్వగా, 9 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 140 మందికి 138 మంది హాజరవ్వగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షలకు మొత్తం 215 మందికి 207 మంది హాజరవ్వగా 8 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మూడు కేంద్రాల్లో 544 మందికి 525 మంది హాజరవ్వగా, 19 మంది గైర్హాజరయ్యారు.

అంగన్వాడీ సెంటర్లను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

ఐసిడిఎస్ సిడిపిఒ విజయకుమారి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిల్లాలోని అంగన్వాడీ సెంటర్ల నిర్వహణలో నూజివీడు ప్రాజెక్టు అగ్రస్థానంలో నిలిచేలా సమైక్యంగా కృషి చేద్దామని ఐసిడిఎస్ సిడిపిఒ పిల్లి విజయకుమారి సూచించారు. పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం నాలుగు యూనియన్ లీడర్స్, సెక్టార్స్ స్థాయి, ప్రాజెక్టుస్థాయి లీడర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిడిపిఒ విజయకుమారి మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో ఉన్న కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సకాలంలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఉన్నతాధికారుల సూచించిన మేరకు వారి ఆదేశాలకు అనుగుణంగా ప్రాజెక్టులో అత్యున్నతంగా విధులు నిర్వర్తించాలన్నారు. సమైక్య ప్రణాళికతో ముందడుగు వేద్దామన్నారు. ఈ సమావేశంలో అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించాలి

సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు మాజీ ఎంఎల్ఎ అప్పారావు వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలో అన్ని హంగులు ఏర్పాటు చేసుకున్న కేంద్రీయ విద్యాలయాన్ని తక్షణమే ప్రారంభించాలని నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరారు. ఈ మేరకు నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు కేంద్రీయ విద్యాలయ బాధ్యత వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ డి.మంజునాథ్‌ను ఇటీవల తాను హైదరాబాదులో కలిసినట్లు చెప్పారు. కొత్తగా మంజూరైన ఎనిమిది కేంద్రీయ విద్యాలయాల్లో ఇప్పటికీ అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. త్వరితగతిన అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభించి తరగతులను కొనసాగించాలని వినతిపత్రం అందించినట్లు చెప్పారు. అందుకు డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. ఎక్కడా లేనివిధంగా నూజివీడు ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయానికి తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేశామన్నారు. మాజీ సిఎం జగన్ ఇక్కడ కేంద్రీయ విద్యాలయ సొంత భవనాల నిర్మాణం కోసం ఏడు ఎకరాలను మంజూరు చేసినట్లు చెప్పారు. నూజివీడు ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు, విద్యాలయ కొనసాగింపుపై ఎలాంటి అపోహలు వద్దన్నారు. త్వరలోనే నూజివీడు ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయ ప్రారంభమవుతుందని వివరించారు.



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ

పని గంటల పెంపు తగదు

సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్రంలో పని గంటల పెంపుదల తగదని సిఐటియు నేతలు అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి బస్టాండ్‌లో సిఐటియు ఆధ్వర్యాన గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి మహిళా కండక్టర్లు మాట్లాడుతూ పని గంటల పెంపుదల వల్ల మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 1886లో కార్మికుల రక్తర్పణతో ప్రాణత్యాగం చేసి ఎనిమిది గంటల పని దినాన్ని మేడే స్ఫూర్తితో సాధించుకుందని తెలిపారు. పని గంటల పెంపుదల చట్టాన్ని వెంటనే నిలిపివేయాలని కార్మిక సంఘాలు, ఆర్‌టిసి సిబ్బంది, ఫెడరేషన్ వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి కండక్టర్లు, సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు, కార్యదర్శి వంగ గోపీ, సీనియర్ నేత కెఎస్.నారాయణ, ఆర్‌టిసి జంగారెడ్డిగూడెం డిపో కార్యదర్శి జిఎస్.నారాయణ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు

'తల్లికి వందనం'.. అందక ఆవేదన

లేని భూములు ఉన్నట్లు చూపించడంతో తల్లుల ఖాతాలో పడని సొమ్ము

సవరణల కోసం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు

అధికారులు సరి చేసి పథకం వర్తింపజేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - మండవల్లి

అధికారుల నిర్లక్ష్యం, పాలకుల బాధ్యతారాహిత్యం వెరసి నిరుపేదల కుటుంబాలను ప్రభుత్వ పథకాలకు దూరం చేస్తున్నాయి. లేని భూములను ఉన్నట్లు చూపించడంతో తల్లికి వందనం అందక లబోదిబోమంటున్నారు. దీంతో సవరణ చేయాలంటూ సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో తల్లికి వందనం ఒకటి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే కుటుంబంలో చదువుకునే విద్యార్థులు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాలో సొమ్ము జమ చేస్తామని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. 2024లో ఎన్నికల్లో గెలుపొంది అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటికీ తల్లికి వందనం పథకం అమలుకు కొంత జాప్యం ఏర్పడింది. 2025 - 26 విద్యా సంవత్సరం ముందు తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేసింది. అయితే ఈ ప్రక్రియ కొంతమంది కుటుంబాల్లో ఆనందాన్ని, మరికొందరి కుటుంబాల్లో ఆవేదనను నింపింది. తల్లికి వందనం పడకపోక వందల ఎకరాలు ఉన్నట్లు మెసేజ్ రావడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. కూలి, నాలి, చేతివృత్తులు పనులు చేసుకునే తమకు వందల ఎకరాలు ఎక్కడున్నాయంటూ వారు ప్రశ్నిస్తున్నారు. తల్లికి వందనం పథకం అమలయ్యే విధంగా సవరణ కోసం పనులు మానేసి సచివాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో సవరణ చేసి తల్లికి వందనం వర్తింపజేసేలా చేసి తమ బిడ్డలు చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సెంటు భూమి లేదు

షేక్ గౌసియా బేగం

నాకు సెంటు భూమి లేదు. నా భర్త డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాని నాకు 948 సర్వే నెంబర్లో 118 ఎకరాలు ఉన్నట్లు చూపిస్తోంది. అందువల్ల నా కుమార్తె నజియా బేగంకు తల్లికి వందనం కింద నగదు జమ కాలేదు. తల్లికి వందనం వచ్చేలా చూడాలని అప్లికేషన్ పెట్టుకున్నాను.

పిల్లల చదువుకు ఉపయోగపడుతుందనుకున్నా

గోర్ల వీరమ్మ

నా భర్త నేను కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. నాకు కుమార్తె తులసి నాగ కృష్ణమ్మ, కుమారుడు హేమ నాగ సూర్య శ్రీ ఉన్నారు. కుమార్తె పదో తరగతి, కుమారుడు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పడుతుందని ఎంతో ఆశించాను. అయితే నాకు 35 ఎకరాలు భూమి ఉన్నట్లు మెసేజ్ వచ్చింది. తల్లికి వందనం వర్తింపజేసేలా చూడాలని దరఖాస్తు పెట్టుకున్నాను.

గతంలో అమ్మఒడి వచ్చింది

మంద వెంకటరత్నమాల

నాకు ఏడో తరగతి చదువుతున్న కుమారుడు నాగ సాయి, ఒకటో తరగతి చదువుతున్న కుమార్తె హర్షిక ఉన్నారు. ఇరువురికి తల్లికి వందనం పడుతుందని ఆశించాను. కాని పడలేదు. ఎందుకు పడలేదని ఆరా తీస్తే నాకు 148/8 సర్వే నెంబర్లలో 21.19 సెంట్లు ఉన్నట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అందువల్ల తల్లికి వందనం ఆపినట్లు తెలిసింది. సవరించి తల్లికి వందనం అందించేలా చేయాలని సచివాలయంలో అప్లికేషన్ పెట్టుకున్నాను. గతంలో నాకు అమ్మఒడి కూడా వచ్చింది.

సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

డిఐపిఆర్ఒ సురేంద్రకు కలెక్టర్ సూచన

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా పని చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి జిల్లా సమాచార పౌర సంబంధాధికారి యు.సురేంద్రకు సూచించారు. ఏలూరు జిల్లా సమాచార పౌర సంబంధాధికారి (ఎడి)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సురేంద్ర కలెక్టరేట్లో గురువారం కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సురేంద్రకు అభినందనలు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని, వాటిని ప్రజలందరికీ తెలిసేలా, అర్హులైన ప్రతిఒక్క లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. సమాచార శాఖ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, జిల్లా పౌర సంబంధాధికారి ఆర్‌విఎస్.రామచంద్రరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న డిఐపిఆర్ఒ

ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చీఫ్ మేనేజర్ కెవిఎస్.కిషోర్ మాట్లాడుతూ జులై ఒకటో తేదీ నాటికి బ్యాంక్ 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది దాతలు తమ రక్తాన్ని దానంగా అందించినట్లు చెప్పారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో ఎస్‌బిఐ ఎప్పుడూ ముందుంటుందన్నారు. రెయిన్‌బో బ్లడ్ బ్యాంక్ వారు రక్తాన్ని సేకరించగా, బ్యాంకు సిబ్బంది, కస్టమర్లు రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు.

రక్తదానం చేస్తున్న బ్యాంకు సిబ్బంది

అప్పగించిన పనిని బాధ్యతతో నిర్వహిస్తాం

నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా శ్రీనివాసరావు, రత్నారావు

ప్రజాశక్తి - కలిదిండి

టిడిపి చింతలపూడి నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా మండలానికి చెందిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కేంద్ర కార్యాలయం నుంచి నియామక పత్రాలు అందుకున్నట్లు తెలిపారు. బాధ్యతతో అప్పజెప్పిన పనిని సక్రమంగా నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఐటి కమ్యునికేషన్ మంత్రి నారా లోకేష్‌కు, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌కు, పార్టీ నియోజకవర్గ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అతిసారపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఐదేళ్ల లోపు పిల్లల్లో అతిసార వ్యాధి వల్ల మరణాలు సంభవించకూడదనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నెల 16వ తేదీ నుంచి జులై 31 వరకు అతిసార వ్యాధి నివారణ కార్యక్రమం అమలు చేస్తుందని బయ్యన్నగూడెం పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం తెలిపారు. బయ్యన్నగూడెం ఎస్‌సి పేట సచివాలయంలో అతిసార వ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు ఒక రోజులో మూడు లేదా అంత కంటే ఎక్కువ సార్లు నీళ్లగా విరేచనాలు అయితే అది అతిసార వ్యాధి అని చెప్పారు. అతిసారలో శరీరంలో ఉండే ఖనిజ లవణాలు బయటకు పోయి డీ హైడ్రేషన్‌కు లోనైనప్పుడు వెంటనే ఒఆర్ఎస్ ద్రావణం తాగటం వల్ల మరణాలు సంభవించకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. కాచి చల్లార్చిన తాగునీటిని తాగాలని, తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాషా, రవితేజ, నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆర్‌పిలకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ఆర్‌పిలకు ట్యాబ్‌లు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అత్యాధునిక సాంకేతిక సాయంతో స్వయం సహాయక సంఘాల సభ్యులకు వేగవంతమైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం వినూత్న తరహాలో కృషి చేస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో పనిచేస్తున్న 157 మంది ఆర్‌పిలకు ఆయన గురువారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అలాగే డిజీలక్ష్మి బయోమెట్రిక్ డివైజ్‌లు అందించారు. స్థానిక పవర్ పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మెప్మా ఎఇ పి.మాధురి, సిఎంఎం ఝాన్సీ, సిఒలు, టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరు : సిఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

'పేదలకు సిఎం సహాయ నిధి వరం'

ప్రజాశక్తి - ఉంగుటూరు

సిఎం సహాయ నిధి పేదలకు వరం వంటిదని ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 34 మంది లబ్ధిదారులకు రూ.25,40,780 విలువైన చెక్కులను గురువారం క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడే పేదలకు ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కరేటి జ్యోతి, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు రాంబాబు, ఆయా గ్రామాలకు చెందిన జనసేన గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : అనారోగ్యంతో బాధపడేవారికి సిఎం సహాయ నిధి సంజీవని వంటిదని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతోమంది బాధితుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపుతున్నామన్నారు. ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో 25 మంది లబ్ధిదారులకు రూ.16,01,255 విలువైన సిఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పేదవారికి ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనిలో భాగంగానే ఇప్పటివరకు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.2,22,81,390 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ఆర్థిక సాయం అందించే విషయంలో సిఎం సహాయ నిధి సంజీవనిలా ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులో మరింత మంది అవసరార్థులకు ఆర్థిక సాయం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మరడాని రంగారావు, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలో అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా నాయకులు కారం దారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కుక్కునూరు ఐసిడిఎస్ సిబ్బందికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది ప్రజాసాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదును తొలిగించాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని కోరారు. సిబ్బందికి ప్రతి నెలా ఐదో తేదీలోపు జీతాలు చెల్లించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రాల్లో పిల్లల మెనూ ధరను పెంచి సరుకులను ప్రభుత్వమే నేరుగా అందించాలని కోరారు. కేంద్రాలకు సన్నబియ్యం సరఫరా చేసి మెరుగైన వసతలు కల్పించాలని డిమాండ్ చేశారు. జులై తొమ్మిదో తేదీన జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని దారయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు కొన్నె లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కూరాకుల బాబూరావు, గిరిజన సంఘం నాయకులు వరసా పాపారావు, మహిళా సంఘం నాయకులు వరకా శ్యామల, అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు కౌలూరి సైదా, చందా రమాదేవి, పిట్టా రమాదేవి, మడకం బద్రి, సుపా భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య రక్షణగా సురక్ష హాస్పిటల్

తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యమే లక్ష్యం

ఆసుపత్రి సిఇఒ డాక్టర్ దిలీప్ కుమార్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం వంటి మెట్ట ప్రాంతంలో సురక్ష ఎమర్జెన్సీ, మల్టీకేర్ హాస్పిటల్ పేద ప్రజలకు ఆరోగ్య రక్షణగా నిలుస్తోందని ఆసుపత్రి సిఇఒ, వైద్యులు దిలీప్‌కుమార్ అన్నారు. కన్నాపురం రోడ్డులో స్థాపించిన ఈ హాస్పిటల్ అత్యాధునిక వైద్య సౌకర్యాలు, నిపుణులైన వైద్య బృందంతో నిరంతర సేవలందిస్తూ, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆసరాగా నిలుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఈ ప్రాంతంలో వైద్య సేవలు సరిగా లేని పరిస్థితుల్లో సురక్ష హాస్పిటల్ ఒక వరంలా అవతరించిందన్నారు. పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమన్నారు.

దిలీప్‌కుమార్

పేదలకు అందుబాటులో వైద్య సేవలు

సురక్ష హాస్పిటల్ పలు కీలక సేవలతో పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తుందన్నారు. ప్రతి మంగళవారం గైనకాలజీ, పీడియాట్రిక్ విభాగాల్లో ఉచిత అవుట్‌పేషెంట్ సేవలందిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రతి నెలా మొదటి ఆదివారం మహిళలకు ఉచిత గైనిక్ స్టిరిలైజేషన్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. కాన్పులు, ఆపరేషన్లు, పిల్లల వైద్యం వంటి ఖరీదైన చికిత్సలను ఎన్‌టిఆర్ వైద్యసేవల ద్వారా పేదలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎప్పుడైనా అత్యవసర వైద్య సహాయం అందించేందుకు 24 గంటలు సేవలు సిద్ధంగా ఉంటాయన్నారు. ఐసియు, ఎన్ఐసియు, ఆధునిక ఆపరేషన్ థియేటర్, 24 గంటల ఫార్మసీ, ఇసిజి, ల్యాబ్, స్కానింగ్, ఎక్స్-రే వంటి సదుపాయాలు ఒకే చోట అందుబాటులో ఉన్నాయన్నారు.

సురక్ష హాస్పిటల్

నిపుణులైన వైద్య బృందం

హాస్పిటల్‌లో పీడియాట్రిక్స్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఐసియు వంటి విభాగాలు ఉన్నాయన్నారు. డాక్టర్ కోటేశ్వరరావు (పిడియాట్రిక్స్), డాక్టర్ రమేష్‌కుమార్ (డిజిఒ), డాక్టర్ కె.శ్రీధర్ రెడ్డి (అనస్థీషియా), డాక్టర్ హర్షిత అందుబాటులో ఉన్నారని తెలిపారు. మెట్ట ప్రాంత వాసులకు మెరుగైన వైద్యం అందించేందుకు అత్యాధునిక వైద్య పరికరాలు, అత్యున్నత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రోగి పరిస్థితికి అనుగుణంగా ఇక్కడ సిబ్బంది పనిచేస్తారన్నారు. 24 గంటలు ల్యాబ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. పేదవారికి అందుబాటులోనే వైద్య సేవలందిస్తున్నామని, మరిన్ని విస్తృత సేవలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎల్‌పిఎం సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ లబ్ధిదారులను జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పిఎం)సమస్యల నుంచి గట్టెంక్కించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తోందని ఉంగుటూరు డిటి వై.పూర్ణచంద్రప్రసాద్ వెల్లడించారు. ఉదాహరణకు గ్రామంలో ఐదు ఎకరాల పొలానికి అందులో ఐదుగురు రైతులు ఉమ్మడి హక్కుదారులు ఉంటే ఆ ఐదు ఎకరాల్లో గట్లు, మడులు లేకుండా ఏక భూమిగా ఉన్నవాటిని జాయింట్ ఎల్‌పిఎంగా పిలుస్తారన్నారు. ఐదుగురు రైతులకు తలొక ఎకరం వాస్తవంగా ఉండాలని, కాని జాయింట్ ఎల్‌పిఎంలో ఆ ఐదుగురు రైతులకు ఒక్కొక్కరికి ఐదు ఎకరాలు ఉన్నట్లు రికార్డుల్లో చూపించడమే అసలు సమస్యకు కారణమన్నారు. తల్లికి వందనం పథకంలో అర్హులైన లబ్ధిదారులకు ఎకరం పొలం ఉన్న ఎల్‌పిఎం కారణంగా ఐదు ఎకరాలు ఉన్నట్లు చూపించడంతో తల్లుల ఖాతాకు తల్లికి వందనం డబ్బులు రాకుండా పోయాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఆయా గ్రామ సర్వేయర్ల లాగిన్‌లో ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

'సోలార్ విద్యుత్ మండలంగా నూజివీడు'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడును సోలార్ విద్యుత్ మండలంగా తీర్చిదిద్దేందుకు బృహత్తరమైన ప్రణాళికతో ముందడుగులు వేస్తున్నట్లు ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ వెల్లడించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ మంత్రి పార్థసారధి ఆదేశాల మేరకు ఎంపిడిఒ కార్యాలయానికి పిఎం సూర్య ఘర్ పథకంలో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమోదం పొందిన తరువాత మండలంలోని ప్రతి గ్రామంలో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. త్రీ కెవి సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేసుకుంటే రూ.74 వేలు రాయితీ పొందుతారన్నారు. ఒక్కసారి పెట్టుబడి పెడితే విద్యుత్ ఆదాతో పాటు సోలార్ విద్యుత్ వలన అదనపు ఆదాయం కూడా లభిస్తుందని సోదాహరణంగా వివరించారు. సమాజంలో పెరుగుతున్న జనాభా, అవసరాల దృష్ట్యా నేడు సోలార్ విద్యుత్ అవసరం ఎంతైనా ఉందని, ప్రతిఒక్కరూ గుర్తించాలని చెప్పారు.

నేడు రెవెన్యూ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 20వ తేదీన రెవెన్యూ దినోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్క రెవెన్యూ ఉద్యోగి, అధికారి పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ కె.రమేష్‌కుమార్, సెక్రటరీ ఎ.ప్రమోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు శతాబ్దాల పైబడి రెవెన్యూ శాఖ ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో ఈ శాఖ కీలకపాత్ర వహిస్తోందని తెలిపారు. రెవెన్యూ శాఖ ఉద్యోగులు ప్రజాభిముఖ పాలన, సత్వర స్పందన వంటి విలువలనుసరించి పని చేయాలని పేర్కొన్నారు. పరస్పర విశ్వాసం కలిగించేందుకు ప్రతి కార్యాచరణల్లో పారదర్శకతను పాటించడం, పూర్తి బాధ్యతా భావంతో ప్రజల సమస్యలకు వెంటనే పరిష్కార ప్రయత్నంచేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. అదే సమయంలో పౌరులకు బాధ్యతాయుతంగా సేవలను అందించడానికి ప్రణాళికతో సమర్థవంతంగా పని చేయడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు, గ్రామ రెవెన్యూ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, తహశీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లకు రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి, అధికారికి రెవెన్యూ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

హామీల అమల్లో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందాయని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య విమర్శించారు. సిపిఐ జంగారెడ్డిగూడెం మండల 11వ మహాసభ గురువారం నిర్వహించారు. పార్టీ పతాకాన్ని సిపిఐ సీనియర్ కార్యకర్త చిలపరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరించారు. గత మహాసభ నుంచి ఈ మహాసభ వరకు మరణించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ మండల కార్యదర్శి జెవి.రమణరాజు సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా మహాసభ రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపింది. సభకు అధ్యక్ష వర్గంగా కుంచే వసంతరావు, నిట్టా స్వర్ణకుమారి వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య హాజరై మాట్లాడారు. బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం ధారయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాడిస రాము మాట్లాడారు. కొయ్యలగూడెం మండల కార్యదర్శి టి.ఆంజనేయరాజు, ద్వారకాతిరుమల మండల కార్యదర్శి గోలిమేబాలయేసు, కుక్కునూరు మండల సహాయ కార్యదర్శి కూరాకుల బాబూరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పి.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చలి, జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజలు చలి జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చలితో కూడుకున్న జ్వరం మలేరియా కావచ్చని, అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయమని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. మలేరియా జ్వరాలు వర్షాకాలంలో ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని, ప్రజలు మలేరియా జ్వరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మలేరియా నివారణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏలూరు టైటాస్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వారు ప్రజలకు మలేరియా జ్వరాలపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఎక్కువగా హాని చేసే దోమలు గృహాలు, గృహ పరిసరాల్లో ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాల్లో ఉంటాయన్నారు. దోమల నిర్మూలన మనతోనే సాధ్యపడుతుందని, ప్రతిఒక్కరూ వారానికి ఒకసారి నీటి నిల్వ ప్రాంతాన్ని కడిగి మూతలు పెట్టుకోవాలని సూచించారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని, ఆశా కార్యకర్తను, ఆరోగ్య కార్యకర్తను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ, మలేరియా పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దొరసానమ్మ, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తల సుహానా, వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్తలు వెంకటదుర్గ, విజయమ్మ, బేబీ సరోజినీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. మండలంలోని రాచన్నగూడెం పంచాయతీ తాటిరామన్నగూడెంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు గిరిజనుల నుంచి పలు పథకాలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను అర్హులైన గిరిజనులు సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురికి రేషన్ కార్డులు, సికెల్ సెల్ వ్యాధులకు స్క్రీనింగ్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కిట్లు, మాతృ వందన పథకం, టిబి కిట్లు, పోషకాహార కిట్లు, బ్యాంక్ ఖాతాలు, పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సున్నం వరలక్ష్మి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్ భాస్కర్, ఎపిఒ జాన్ వెస్లీ, పంచాయతీ రాజ్ ఎఇ రామానుజం, హౌసింగ్ ఎఇ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అశోక్, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

మండవల్లిలో..

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఇంగిలంపాకలంక జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి అన్నారు. ఆ పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయుల ఆర్థిక సహాయంతో అందించిన నోటు పుస్తకాలు స్టేషనరీని గురువారం ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. అనంతరం నోట్ పుస్తకాలను వితరణగా అందించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదిశేషు, రామోజీరావు, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు మొదటి రోజు నుంచి కృషి చేస్తున్నట్లు శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి తేజేంద్ర తెలిపారు. పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా లైబ్రరీ, లాబరేటరీలు, క్రీడా ప్రాంగణం, వేరువేరుగా నిర్మించిన మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు సురక్షిత తాగునీటిని అందిస్తున్నామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే బాలికల కోసం కళాశాల ఆవరణలోనే రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం ఉన్నట్లు చెప్పారు. నిత్యం కళాశాల అధ్యాపకుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. మొదటి రోజు నుంచి విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ, చదువులో విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకునేలా స్నేహపూర్వక వాతావరణంలో విద్యా బోధన ఉంటుందన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు అందజేత

చింతలపూడి : పాత చింతలపూడి గ్రామంలోని ఎంపిపిఎస్(ఎస్‌సి) పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు గురువారం టిడిపి చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు కూసం దామోదర్, టిడిపి సీనియర్ నాయకులు నక్క భాస్కరరావు, ఎస్‌సి సెల్ చింతలపూడి టౌన్ కార్యదర్శి బోడా సాగర్, అంగన్వాడీ హెల్పర్ కమల, తదితరులు పాల్గొన్నారు.

'యోగాతో సంపూర్ణ ఆరోగ్యం'

ప్రజాశక్తి - ముసునూరు

సంపూర్ణ ఆరోగ్యకరంగా ఉండాలంటే ప్రతి వ్యక్తి యోగా చేయాలని గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి, రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎంపిపి కొండా దుర్గాభవాని ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రమైన ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాలు విద్యార్థులచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ ఎస్.పంగిడియ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ :అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాసనాలు వేయాలన్నారు. కళాశాల సిపిడిసి సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు, ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ యోగా బోధకులు ఆదినారాయణ మాట్లాడారు. అనంతరం యోగా బోధకులు విద్యార్థులు, కళాశాల సిబ్బందితో యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమాన్ని యోగా దినోత్సవ కళాశాల ఇన్‌ఛార్జి టివి.దుర్గాప్రసాద్ ఏర్పాటు చేయగా కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి : ఎంఎల్ఎ

జీలుగుమిల్లి :ఈ నెల 21న విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి పోలవరం నియోజకవర్గం నుంచి కూటమి నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరుకానున్నట్లు తెలిపారు.

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాహుల్ గాంధీ 55వ పుట్టినరోజు వేడుకలను పట్టణంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కప్పల సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారాం ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా సెక్రటరీ పొన్నా రామచంద్రరావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు రాజారత్నం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దారం సత్తిరాజు, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దుకూరి బుచ్చిరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ :ఏలూరులోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, తాళ్లూరి చక్రవర్తి, బ్లాక్ మన అధ్యక్షుడు చెక్క గుప్త, తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, పెనుగొండ గ్రామానికి చెందిన కమరకోట కృష్ణ, తండ్రి : పుల్లయ్య, గుబ్బల వారి వీధి కి చెందిన అను నేను నా యొక్క డాక్యు మెంట్ పడిపోయింది. ఇంటి దగ్గరనుండి జిరాక్స్ సెంటర్ కు వెళు తుండగా నాయొక్క లింక్ డాక్యు మెంట్ నెంబర్ : 354/1995 గల డాక్యు మెంట్ పడిపోయింది. డాక్యు మెంట్ ఏవరికైన దొరకిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియ జేయగలరు.

కమరకోట కృష్ణ
C/o: పుల్లయ్య
డోర్ నెం: 15-32
గుబ్బల వారి వీధి
పెనుగొండ, పెనుగొండ మండలం,
సెల్ నెం: 97018 56621

సబ్ డివిజన్ కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రీసర్వే పూర్తయిన గ్రామాల రైతులు సబ్ డివిజన్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసిల్దార్ టి సాయిబాబా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తయినట్లు పేర్కొన్నారు. మండలంలోని కృష్ణాపురం, వాకలపూడి, రామన్నపాలెం, కొల్లివారిగూడెం, గుడ్లపల్లి, అప్పలరాజుగూడెం గ్రామాల్లో రీ సర్వే పూర్తయినట్లు తెలిపారు . రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు అర్హులు ఇబ్బంది పడకుండా రీ సర్వే అనంతరం ఇచ్చిన జాయింటు ఎల్‌పిఎంలను సబ్ డివిజన్ సెట్టింగ్ చేసుకునేందుకు సచివాలయం, మీ సేవలలో చెల్లించేందుకు కట్టాల్సిన రుసుం రూ.550గాను రూ.50 తగ్గించినట్లు తెలిపారు. జాయింటు ఎల్‌పిఎందారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సబ్ డివిజన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయినది

కోళ్ళ పెద్ది లక్ష్మి, భర్త, పెద్దిరాజు, డోర్ నెంబర్ 1-175, గుబాలగుంట, కొత్తపేట, దిగమర్రు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా

నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి 04-02-2010 న **H7985227 నెంబర్ పాస్పోర్ట్** తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ను తీసికొని ది. 15-01-2025 న మా ఇంటి నుంచి పాలకొల్లుకు మోటార్ సైకిల్ పై జెరాక్స్ కాపీలు తీయించుటకు రాగా దారిలో నా ఒరిజనల్ పాస్ పోర్ట్ పడిపోయింది. దారిలో ఎంత వెదికినా దొరకలేదు. కాబట్టి నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన నా పై అడ్రస్ కు అందజేయగలరు.

నా సెల్ నెం: 93905 23193

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, పోలమూరు గ్రామం, కాకరవారి పాలెం గ్రామ కాపరస్తులైన నంగలం ముసలయ్య, తండ్రి: రామలింగం అను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. నేను పై అడ్రసు నందు నివాసము ఉంటున్నాను. నాకు పాస్‌పోర్టు ఉన్నది. నేను కూలిపని చేసుకొని జీవనం సాగిస్తున్నాను. నేను కాకర్లవారి పాలెంలో ఉన్న మురికి కాలువ ప్రక్కన ఉన్న గుడిసెలో నా కుటుంబంతో కలిసి నివాసము ఉంటున్నాను. 2024లో వచ్చిన బారీ వర్షాల కారణంగా నా గుడిసెకి ఆనుకొని ఉన్న మురికి కాలువ పొంగి మా సామాన్లు కొన్ని కొట్టుకుపోయాయి. అందులో నా పాస్‌పోర్టు కూడా ఉన్నది. కావున దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నంబరుకు తెలియజేయగలరు.

నంగలం ముసలయ్య
పోలమూరు గ్రామం
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా
సెల్ నెం: 93907 41549

IN THE COURT OF THE CHAIRMAN MOTOR ACCIDENT CLAIMS TRIBUNALS-CUM-III ADDL.DISTRICT JUDGE:RANGA REDDY COURT AT :: LB NAGAR.
O.V.O.P.No. 133 OF 2024.

Between:
Pathulothu Sathish ...Petitioner.
AND
Mungara Antharvedi and other ...Respondents.

To,
Mungara Antharvedi S/o Mungara Venkateswara Rao age: 59 years, Occu: Bussiness, R/o H.NO.C2-122, Ramalayam Center, Gudivakalanka, West Godavari, Andrapradesh, PIN Code:534004 (Owner of crime Vehicle Bearing No. AP 39 VA 2480

Please take notice that the above said petitioners filed the above O.P. No. 133/2024 against you and the cholamandalam Gen-insurance company.Ltd & Siriberi Durga Prasad, seeking compensation. The said case is stands posted on 24-06-2025 for your appearance therefore you are hereby required to be present before the Court of the Hon'ble Chairman Motor Accident Claims Tribunal-Cum-III ADDl.. District Judge, Ranaga Reddy Court, At: L. B Nagar, Hyderabad, on 24-06-2024 at 10.30 a.m., either in person or through an Advocate, failing which the case will be decided Ex-Parte.

//BY ORDER OF THE COURT//
NOMULA SAIDULU
Advocate,
Counsel for the Petitioners.
Cell: 9642967148

ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
ఐ.పి.నెం. 5/2024

బిట్వీన్:
శ్రీ కత్తుల వెంకటేశ్వరరావు ...పిటీషనర్
మరియు
జడ్డు ఆదినారాయణ మరియు 19 మంది వగైరా ...రెస్పాండెంట్స్

సమన్స్ టు:
R-8: పీతల రవీంద్ర, పురుషుడు, వయస్సు 45 సం.రం, ఆర్.టి.సి. ఎంప్లాయ్ (DME), APSRTC డిపో, నరసాపురం, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మీ పై కత్తుల వెంకటేశ్వరరావు అను వారు ఫైల్ చేసిన ఐ.పి లో మీరు ఎనిమిదవ ప్రతివాది అయియున్నారు. మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా వారు మీకు ఎన్నిసార్లు రిజిష్టర్ పోస్ట్ ద్వారాను, మరియు శ్రీ కోర్టు వారి ద్వారాను నోటీసులు పంపించినప్పటికీ ఐ.పి సమన్లు మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా **ది. 11-07-2025 సం.రం తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల పరోక్షమున సదరు ఐ.పి విచారించబడి, తీర్మానించబడునని మీకు తెలియజేయుచున్నాము.

జి.పి. సుదర్శనరావు
నరసాపురం పిటీషనర్ తరపున న్యాయవాది
తేది. 19-06-2025 నరసాపురం
సెల్ నెం. 99856 49898